సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



రైతులకు అండగా ఉంటాం

రైతులు పండించిన పత్తిని మొత్తం సీసీఐ కొనుగోలు చేసేలా చూస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



మెరుగైన సేవలు

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప పేర్కొన్నారు. 8లో▸



పెన్షన్ పెంచాలి

దివ్యాంగులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ పెంచాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సమీక్షలో అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నిర్వహణపై గురువారం డిప్యూటీ కలెక్టర్ (ఎన్నికల సంఘం) చెన్నయ్య ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ చెన్నయ్యను అభినందించిన డీజీపీ



షాద్‌నగర్: షాద్‌నగర్‌కు చెందిన కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్యను డీజీపీ జితేందర్ అభినందించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం మహిళా పోలీస్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ పోలీసులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ చెన్నయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

మొయినాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో పార్టీ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని అన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ప్రజా పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రభాకర్, దర్శన్, హనుమంతు, ఎండీ జహంగీర్, రత్నం, వెంకటయ్య, జలీల్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించండి

- జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్



ముడిమ్యాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి, డీపీఓ సురేశ్‌మోహన్ తెలిపారు. మండలంలోని ముడిమ్యాలలో జరుగుతున్న పారిశుద్ధ్య డ్రైవ్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో తప్పనిసరి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మండలంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు అన్ని కుటుంబాలను తప్పకుండా కలవాలని సూచించారు. డీపీఓ వెంట ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విశలేశ్వర్‌జీ తదితరులు ఉన్నారు.

మేమూ బీసీలమే..



సమావేశానికి హాజరైన బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు

రాజకీయ రిజర్వేషన్లు కల్పించండి

- చిన్న పదవులు కూడా దక్కడం లేదు
- అంతరించి పోతున్న వృత్తులకు జీవం పోయండి
- వెనుకబడిన తరగతుల కమిషన్‌కు వృత్తిదారులు, సంచార జాతుల విజ్ఞప్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పేరుకు తాము బీసీలమే అయినా.. రాజకీయ రిజర్వేషన్లు దక్కడం లేదు.. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలను పెద్దకులాలే అనుభవిస్తున్నాయి.. గ్రామాల్లో కనీసం తమను మనుషులుగా కూడా చూడడం లేదు' అని వృత్తిదారులు, సంచార జాతుల వారు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో అట్టడుగున ఉన్న వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ గురువారం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపట్టింది. కార్యక్రమానికి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన కుల సంఘాలు, వృత్తిదారులు, రాజకీయ పార్టీల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వృత్తిదారులు, సంచార జాతుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి, పూసలి, వాల్మీకిబోయ, ఆరెకటిక, సగర, ఉప్పర, వడ్డెర, క్షౌర వృత్తిదారులకు రాజకీయంగా కనీస ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో చాలా తక్కువ జనాభా ఉన్న ఈ సంచార జాతులు ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కూడా నష్టపోవాల్సి వస్తోందని, కార్పొరేటర్, కౌన్సిలర్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులే కాదు కనీసం వార్డు మెంబర్ వంటి చిన్న పదవులు కూడా తమకు దక్కడం లేదని కమిషన్ ముందు వాపోయారు.

ఎవరేమన్నారంటే..

సంచార జాతుల సంఘం అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. బీసీల్లో ఇప్పటి వరకు ఏ కులం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిందో గుర్తించి, వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. మొదట్లో తాము ఎస్టీ జాబితాలో ఉన్నామని, ఆ తర్వాత ప్రభుత్వం తమను బీసీ–ఏలో చేర్చి తీరని అన్యాయం చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ఇచ్చే రుణాల కోసం 3,500 మంది దరఖాస్తు చేసుకుంటే లబ్ధి పొందిన వారిలో వాల్మీకి బోయ కులస్తులు ఒక్కరూ లేరన్నారు. కుమ్మర సంఘం అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ.. అంతరించి పోతున్న తమ వృత్తికి జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వంద ఎకరాలు కేటాయించి వృత్తిదారులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. వడ్డెర సంఘం అధ్యక్షుడు విష్ణుబాబు మాట్లాడుతూ.. క్వారీల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రమాదవశాత్తు గాయపడిన వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. క్షౌరవృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలు వచ్చి వృత్తిదారుల జీవనోపాధిని దెబ్బతీశాయని, రాజకీయాల్లోనైనా రిజర్వేషన్లు వర్తింపజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు ఎ.వెంకటాచారి మాట్లాడుతూ.. కట్టెకోత మిషన్లకు 5హెచ్‌పీ వరకే ఉచిత కరెంట్ ఇస్తున్నారని, దీన్ని 10 హెచ్‌పీ వరకు పెంచాలని, 50 ఏళ్లు నిండిన వృత్తిదారులందరికీ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఆరెకటిక సంఘం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. మాంసం విక్రయాలపై ఆధారపడిన తమ వృత్తిదారులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని కోరారు. సగర సంఘం అధ్యక్షుడు సతీష్ సాగర్ మాట్లాడుతూ.. చిన్నచిన్న సివిల్ కాంట్రాక్టులు చేసుకుని జీవించే తమ వృత్తిదారులను బీసీ డి జాబితా నుంచి తొలగించి, బీసీ ఏ జాబితాలో చేర్చాలన్నారు. పూసలి సంఘం అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ తమకు కనీస గుర్తింపు లేకుండా పోయిందని, రాజకీయంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తులను కమిషన్ ఓపిగ్గా విని, ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొంది.

హక్కుల పరిరక్షణే ధ్యేయం

బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పని చేస్తుందని కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సమాజంలో వెనుకబడిన, బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ హక్కుల విషయంలో కమిషన్ ముక్కుసూటిగా వ్యవహరిస్తుందన్నారు. బీసీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమగ్రకుల సర్వే చారిత్రాత్మక నిర్ణయమని, జనాభాలో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోరుకునే ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 నుంచి 70 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. జిల్లాలో నిర్వహించిన బహిరంగ చర్చలో 72 పిటిషన్లు అందాయని వెల్లడించారు. జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, బట్రాజ్ కులాలను బీసీ డీ నుంచి ఏ జాబితాలోకి మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆపేరుతో పిలవడం మానేసి వంశరాజ్‌గా మాత్రమే పిలవాలనే వినతులు అందినట్లు చెప్పారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్,బాలలక్ష్మి పాల్గొన్నారు.

పత్తాలేని కొత్త జీతం!

- నెల దాటినా అందని వేతనాలు
- ఇప్పటికీ అందని గుర్తింపుకార్డులు
- పర్మినెంట్ అకౌంట్ నంబర్లదీ అదే పరిస్థితి..
- నూతన ఉపాధ్యాయుల ఎదురుచూపులు



ఇబ్రహీంపట్నం రూరల్: కొత్తగా కొలువులో చేరారు.. విద్యార్థులకు ఉత్సాహంగా పాఠాలు బోధించారు.. ఎప్పుడెప్పుడు మొదటి వేతనం అందుకుంటామా అని ఆత్రుతగా ఎదురుచూశారు.. నెల దాటినా చేతికి డబ్బులు రాకపోవడంతో నిరుత్సాహంగా నిరీక్షిస్తున్నారు.. కొత్త ఉపాధ్యాయులకు మొదటి వేతనం కోసం ఎదురు తెన్నులు తప్పడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటిసారిగా ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమావేశమై ప్రొసీడింగ్‌లు అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసి ఆనందంగా విధుల్లో చేరారు. నెల రోజులు గడిచినా కొత్తగా చేరిన టీచర్ల చేతికి మొదటి జీతం అందలేదు. తమకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది.. మొదటి జీతం కూడా అందుకున్నాం అని సగర్వంగా చెప్పుకొనే సమయం ఎప్పుడా అని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 345 మంది నిరీక్షణ

జిల్లాలో 345 మంది కొత్త ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్టోబర్ 10న నియామకపత్రాలు అందజేశారు. స్కూల్ అసిస్టెంట్లు–3, ఎస్జీటీలు 8, ఉర్దూ –3, లోకల్‌బాడీ లాంగ్వేజ్ పండిట్ –12, తెలుగు –19, ఉర్దూ –1, పీఈటీ –6, బయోసైన్స్ –13, ఎస్‌ఏ తెలుగు –4, ఎస్‌ఏ హిందీ –2, లోకల్‌బాడీ ఎస్జీటీ గణితం –2, ఉర్దూ –5, ఎస్‌ఏ సోషల్ –26, ఎస్‌ఏ ఫిజిక్స్–1, ఎస్జీటీ తెలుగు 194, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు –43 మంది చొప్పున ఎంపికయ్యారు. అక్టోబర్ 16న వారిని ఆయా పాఠశాలలకు కేటాయించారు.

ఐడీలు లేవు.. అకౌంట్ లేదు

కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులను సర్వీస్‌లోకి తీసుకోగానే ఎంప్లాయ్ ఐడీ ఇవ్వాలి. పర్మినెంట్ అకౌంట్ నంబర్లు ఇవ్వాలి. కానీ సగం మందికి మాత్రమే ఐడీలు ఇచ్చారు. మిగతా వారికి ఐడీలు ఇవ్వడంలో.. అకౌంట్ నంబర్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీకి ఉద్యోగులు విధుల్లో చేరి నెల గడిచింది. మరో పది రోజులు అదనంగా హాజరయ్యారు. అయినా ఇంత వరకు జీతం రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. త్వరగా స్పందించి వేతనం అందేలా చూడాలని కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం..



ఉద్యోగం వచ్చిందని సంతోషంగా విధుల్లో చేరాం. కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టాం. పిల్లలకు నెల రోజులుగా పాఠాలు బోధించాం. మొదటి జీతం ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– భరత్‌కుమార్, ఎంపీయూపీఎస్, గుమ్మడవెల్లి

తక్షణమే అందించాలి



జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులకు ముందుగా ఐడీ నంబర్లు, పర్మినెంట్ అకౌంట్ నంబర్లు అందజేయాలి. నెల గడిచినా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదు. వెంటనే జీతాలు చెల్లిస్తే బాగుంటుంది.

– వర్కాల పరమేష్, పీఆర్‌టీయూ, నాయకుడు

బీసీలకు నిధులు కేటాయించండి

బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న మానపాటి ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం బీసీ జనాభాకు దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, బీసీ స్థితిగతుల అధ్యయనంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని మానపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీల కుల గణన సర్వేతో బీసీ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా కార్పొరేట్ విధానం వ్యాపార రంగంలోని ప్రవేశించి గ్లోబలైజేషన్, ఇండస్ట్రియల్ పేరుతో కులవృత్తులను పూర్తిగా నాశనం చేసిందని అన్నారు. ప్లాస్టిక్ వచ్చిన తర్వాత మేదరి కులస్తులు, వడ్రంగి, కుమ్మరి కులవృత్తుల వారు తమ వృత్తులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. స్వర్ణకారులు, మత్స్యకారులు, గీత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు కులవృత్తులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులవృత్తులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కృష్ణాజీ, శ్రీధర్‌వర్మ, అశోక్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

స్పష్టత లేకుండా ఎలా సర్వే చేస్తారు?

అధికారులను నిలదీసిన రైతులు



అగర్‌మియాగూడ పరిధిలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు: తమకు భూమికి భూమి ఇస్తారా.. లేదంటే పరిహారమా.. లేక పూలింగ్ పద్ధతిలో సేకరించనున్నారా అనే విషయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే తమ భూముల్లో సర్వే చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీలోకి నేరుగా చేరుకునేలా నిర్మించనున్న రహదారికి అవసరమైన భూసేకరణ విషయంలో గురువారం రెవెన్యూ అధికారులు మండల పరిధిలోని అగర్‌మియాగూడ పరిధిలో సర్వే చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు సీతారామ్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య సర్వే పనులు చేపట్టారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీకి సేకరించిన భూముల్లోకి చేరుకునేలా రహదారులు ఉండగా మళ్లీ కొత్తగా 330 అడుగుల రహదారి ఎందుకని రైతులు ప్రశ్నించారు. శ్రీశైలం రహదారిని విస్తరిస్తే తమ భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదన్నారు. తమ భూములు తీసుకుని ఏం ఇస్తారో చెప్పకుండా సర్వే ఎలా చేస్తారని నిలదీశారు. సర్వే చేస్తేనే ఎవరి భూమి ఎంత మేర పోతుందో తేలుతుందని.. ఆ తర్వాతే ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో తెలుస్తుందని అధికారులు నచ్చజెప్పారు. అనంతరం రైతులు తమ డిమాండ్లను వినతిపత్రం రూపంలో ఆర్డీఓకు అందించారు.

5 నెలల్లో 1,884 ఫైళ్లు క్లియర్

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతుల్లో వేగం పెంచినట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ వరకు 1,884 ఫైళ్లను పరిష్కరించినట్లు చెప్పారు. గత ఏడాది ఇదే కాలంలో 1,356 ఫైళ్లను పరిష్కరించగా ఈసారి 14.4 శాతం అదనంగా పరిష్కారం అయ్యాయన్నారు. 39 శాతం ఫైళ్లు అదనంగా వచ్చాయన్నారు. గత సంవత్సరం ఇదే కాలంలో దరఖాస్తుదారులు టీజీబీ పాస్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎలాంటి జాప్యానికి తావు లేకుండా 10 రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారానికోసారి పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

గన్ మిస్ ఫైర్

అమెరికాలో ఉప్పల్ యువకుడి మృతి

- పుట్టిన రోజు నాడే విషాద ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



అరుణ్ రెడ్డి (ఫైల్)

ఉప్పల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఉప్పల్ బ్యాంక్ కాలనీకి చెందిన యువకుడు తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్ మిస్ ఫైర్ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి పుట్టిన రోజే ఈ విషాద ఘటన చోటు చేసుకోవడంతో మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు ఇక తిరిగిరాడనే విషయాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీనగర్ పోచంపల్లి మండలం పెద్దరావుల పల్లి గ్రామానికి చెందిన వ్యాపారి పాల్వాయి సుదర్శన్ రెడ్డి, దీప దంపతులు ఉప్పల్ బ్యాంక్ కాలనిలో నివాసముంటున్నారు. వీరి ఒక్కగానొక్క కుమారుడు పాల్వాయి అరుణ్ రెడ్డి (24) గత ఏడాది డిసెంబర్‌లో అమెరికాలోని జార్జియా స్టేట్ అట్లాంటా పట్టణంలోని కెనిస్వా యూనివర్సిటీలో ఉన్నత విద్య కోసం వెళ్లాడు. ఈ నెల 13న తన గదిలోనే స్నేహితుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నాడు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అరుణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ కావడంతో తూటా అరుణ్ ఛాతీలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తండ్రి సుదర్శన్ రెడ్డి తెలిపారు. తన కుమారుడికి ఆర్మీలో చేరాలనే కోరిక ఉండేదని, అందులో భాగంగానే గన్ పేల్చడంలో శిక్షణ కూడా పొందుతున్నాడన్నారు. అమెరికాలో గన్ కొనుగోలు చేసిన విషయం తనకు తెలియదన్నారు. సాధారణంగా తర్ఫీదు పొందిన వారికి హంటింగ్ కోసం గన్ కొనడానికి లైసెన్స్ ఇస్తారని తెలిపారు. అలా లైసెన్స్ ఇవ్వడం వల్లే తన కుమారుడు అసువులు బాశాడని సుదర్శన్ విలపించారు. గురువారం రాత్రి మృతదేహాన్ని అమెరికా నుంచి ఉప్పల్‌లోని స్వగృహానికి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు.

మైసిగండి ఆలయాభివృద్ధికి కృషి



మైసిగండి మైసమ్మ సన్నిధిలో ఎంపీ డాక్టర్ మల్లురవి తదితరులు

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి

కడ్తాల్: దక్షిణ తెలంగాణలోనే ప్రఖ్యాతిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ఆలయంలో మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూడాలని ఆలయ ట్రస్టీ శిరోలీ, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ జ్యోతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధి భేష్



ఎన్కెపల్లిలో ఒడిశా బృందానికి స్వాగతం పలుకుతున్న స్థానిక అధికారులు

కితాబిచ్చిన ఒడిశా అధికారుల బృందం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణలో పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి ఎంతో బాగుందని ఒడిశా అధికారుల బృందం కితాబిచ్చింది. మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామాన్ని గురువారం 22 మందితో కూడిన బృందం సభ్యులు సందర్శించారు. స్నేహ పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమై ముచ్చటించారు. ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పొందుతున్న వివిధ దుకాణాలను పరిశీలించి వారితో మాట్లాడారు. సభ్యులు ఎలా సమావేశం అవుతారు.. ఎప్పుడెప్పుడు సమావేశాలు నిర్వహిస్తారు.. ప్రభుత్వం ద్వారా ఒక్కో సంఘానికి ఎంత రుణం ఇస్తున్నారు.. అప్పులు ఎలా కడుతున్నారు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల పనితీరు బాగుందని అభినందించారు. తమ రాష్ట్రంలో ఇలాంటి సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీజీఐఆర్‌డీ అపార్డ్ శిక్షణ అధికారి అనిల్‌కుమార్, ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సీసీ రమేష్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప


సిబ్బందికి అవార్డులు అందజేస్తున్న మేనేజర్

ఇబ్రహీంపట్నం: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని మేనేజర్ వెంకట నర్సప్ప పేర్కొన్నారు. ప్రతి నెల జరిగే ప్రగతి చక్రం, క్యాష్ అవార్డులను గురువారం ఆయన సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్ లెవల్‌లో ఇబ్రహీంపట్నం డిపో 2002–03 మూడో స్థానంలో, 2003–04లో రెండో స్థానానికి వచ్చిందని, అదే విధంగా 2024–25లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో మన డిపోను ఉంచాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజేశ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


లక్ష్మీదేవి (ఫైల్)

మీర్‌పేట: కుమారుడి ఇంటికి వచ్చిన మహిళ అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా డోన్ మండలానికి చెందిన లక్ష్మీదేవి(50) ఈ నెల 16వ తేదీన మీర్‌పేట నందనవనంలో నివాసముండే కుమారుడి ఇంటికి వచ్చింది. 18వ తేదీన ఉదయం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ వాహనం ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్‌రూరల్: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి వాహనం ప్రమాదానికి గురైంది. గురువారం ఆయన షాద్‌నగర్ నుంచి పాత జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ఫరూఖ్‌నగర్‌కు చెందిన జంగయ్య హైదరాబాద్ రోడ్డులో స్కూటీపై వెళుతూ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి కారు స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జంగయ్యను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సురక్షితంగా ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య
- చేవెళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం


సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రైతులు పండించిన పత్తిని మొత్తం సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని దామరగిద్ద సమీపంలో ఉన్న శ్రీనివాస కాటన్ మిల్లు వద్ద గురువారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు పండించిన ధాన్యం, పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. చేవెళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం, శంకర్‌పల్లి, షాబాద్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా మద్దతు ధరలు అందించాలని ఆదేశించారు. పత్తి మద్దతు ధర రూ.7,200ల నుంచి 7,400 వరకు ఉంటుందన్నారు. రైతులు దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీసీఐ ప్రతినిధి రాజీవ్, పత్తి మిల్లు యజమాని రమేశ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి మహేందర్, వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, డైరెక్టర్లు మల్లేశ్, నరేందర్, జనార్దన్, నాయకులు రాములు, శ్రీనివాస్‌గౌడ్, మధుసుదన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

వేగంగా వెళ్తున్న కార్లు ఢీ


సాగర్‌రోడ్డుపై చౌదర్‌పల్లి గేట్ వద్ద ఢీకొన్న కార్లు

యాచారం: హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై చౌదర్‌పల్లి గేట్ వద్ద వేగంగా వెళ్తున్న మూడు కార్లు గురువారం రాత్రి ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేగ నియంత్రణ(స్టాపర్లు)లను అంచనా వేయకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు భావించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కార్లు ఢీకొనడంతో కొద్దిసేపు సాగర్ రహదారిపై ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

చెకుముకి పోటీల్లో ప్రతిభ



షాద్‌నగర్: జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


కేశంపేట: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

షాద్‌నగర్: జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాలలోని ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఠాగూర్ పాఠశాలకు చెందిన మహ్మద్ జోహెబ్, షరీక్, ఫైజల్, దెబాదిత్యలు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్ హర్మాశ్ అభినందించారు.

టాలెంట్ పరీక్షలు

కొందుర్గు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. చౌదరిగూడ మండలంలోని వివిధ పాఠశాలల్లో సైతం విద్యార్థులకు పరీక్షలు ఏర్పాటు చేశారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 28న జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు గోపీనాథ్, సునిత, ప్రేమ్‌సాగర్, శ్రీదేవి, నర్సింలు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను నిర్వహించారు. కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రావణ్, శివశంకర వరప్రసాద్, స్పందన, నవీన్, భవ్యశ్రీ, శ్రీలత.. రామకృష్ణ విద్యాలయం నుంచి రిషికుమార్, శ్రీహరి, ఆదిత్య కృష్ణలు పోటీల్లో టాపర్లుగా నిలిచారు. వీరు జిల్లా స్థాయిలో ఈ 28న నిర్వహించే పోటీలకు అర్హత సాధించినట్లు ఉపాధ్యాయుడు ఇజాజ్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఎంఈఓ చంద్రశేఖర్ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యూస్ రీడర్‌కు వేధింపులు

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తనను వెంటాడి వేధింపులకు గురిచేస్తున్నాడని, తన ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మహిళా న్యూస్ రీడర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఓ యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ టీవీ చానల్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్న యువతికి ఐదేళ్ల క్రితం హరీష్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఏడాది క్రితం హరీష్ మరో యువతిని వివాహం చేసుకోవడంతో బాధితురాలు అతడితో మాట్లాడటం ఆపేసింది. అయితే హరీష్ కొంతకాలంగా ఆమెను వెంబడిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, తన సహోద్యోగుల ఎదుట దుర్భాషలాడుతూ తన ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్నాడంటూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం తన కార్యాలయానికి వచ్చిన హరీష్ కిందికి వెళ్లి మాట్లాడుకుందామంటూ బలవంతంగా బయటికి తీసుకువచ్చి లిఫ్ట్‌లో ఎక్కిన తర్వాత కొట్టడమే కాకుండా కారు రెడీగా ఉంచండి..అంటూ తన స్నేహితులకు చెప్పాడన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా నిందితుడు తన వెంట పడుతున్నాడని, వేధింపులకు గురిచేస్తున్నాడని, ఫోన్ చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు నిందితుడు హరీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్లలో దోపిడీలకు పాల్పడుతున్న ముఠా నాయకుడి అరెస్టు

పరారీలో మరో నలుగురు నిందితులు

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణిస్తూ విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రట్టు చేశారు. గురువారం ముఠా నాయకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పరారీలో ఉన్న మరో నలుగురు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్లు బీ.సాయీశ్వర్‌గౌడ్, బీఎస్ సారస్వత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... నార్త్‌వెస్ట్ ఢిల్లీకి చెందిన రణ్‌బీర్ సింగ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. మద్యం, మాదకద్రవ్యాలకు బానిసైన అతను రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఢిల్లీ రైల్వేస్టేషన్ పరిధిలో పలు దొంగతనాలు చేసిన అతను అక్కడి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో పరిచయమైన మరి కొందరితో కలిసి ముఠాగా ఏర్పడిన అతను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేంద్రంగా చోరీలు చేస్తున్నాడు. ఈనెల 21న ఉదయం తన బృందంతో కలిసి దొంగతనాలు చేసేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న రణ్‌బీర్‌సింగ్ అనూహ్యంగా పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసుల విచారణలో ఇక్కడ నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. చోరీ సొత్తును కరిగించి బంగారాన్ని ముఠా సభ్యులందరూ సమానంగా పంచుకునేవారమని నిందితుడు పోలీసుల విచారణలో పేర్కొన్నాడు. అతడి నుంచి రూ. 21 లక్షల విలువైన 216 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. జట్టు సభ్యులైన హరియాణాకు చెందిన షంషేర్, సుమిత్, సత్బీర్, జగదీశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సింహగర్జన విజయవంతం చేయండి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేశ్ తదితరులు

నందిగామ: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరగకుండా అందరం సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుచ్చన్న ఆధ్వర్యంలో గురువారం మాల మహానాడు నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్ హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాలలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని, మాలలకు అన్యాయం జరగకముందే అప్రమత్తంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని సూచించారు. వచ్చే నెల 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహ గర్జన సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనికి మాలలు విధిగా హాజరు కావాలన్నారు. అనంతరం సింహ గర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు రామకృష్ణ, జనార్దన్, అర్జున్ నాయకులు వెంకటయ్య, లింగం, నర్సింహులు, రాంచంద్రయ్య, మహేశ్, యాదయ్య, జంగయ్య, సాయి, ప్రేమ్, ప్రభయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన కొత్తూరు మండల పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తాలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం పెద్దపొర్ల గ్రామానికి చెందిన రమేశ్(25) శంషాబాద్ మండలం పాలమాకులలో నివాసం ఉంటూ, అక్కడే స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రమేశ్ తన సొంత గ్రామం పెద్దపొర్ల గ్రామానికి వెళ్లేందుకు ఈ నెల 20న అర్ధరాత్రి పాలమాకుల నుంచి తన బైక్‌పై బయలు దేరాడు. మార్గ మధ్యలో తిమ్మాపూర్ చౌరస్తాలో నడుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన రమేశ్, గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ఆర్టీఓ ఆటకట్టు

- కారులో తిరుగుతూ దందాలు
- నాలుగు నెలలుగా సెంట్రింగ్ మిల్లర్లను బెదిరించి వసూళ్లు


నిందితుడు ప్రేమ్ కుమార్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ పోలీసులు నకిలీ ఆర్టీఓ ఆట కట్టించారు. కారులో తిరుగుతూ సెంట్రింగ్ మిల్లర్లను భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ హనుమసాయినగర్ ప్రాంతానికి చెందిన ప్రేమ్ కుమార్ రెడ్డి స్థానికంగా కట్టెల మిషన్ నడుపుతున్నాడు. నాలుగు నెలలుగా అతను ప్రతి రోజు తెల్లవారుజామున ఆర్టీఏ అవతారం ఎత్తేవాడు. కారులో తిరుగుతూ రోడ్డుపై వెళుతున్న సెంట్రింగ్ మిల్లర్లను అడ్డగించి తాను ఆర్టీఓనని కాగితాలు చూపించాలంటూ, బండి ఓవర్ లోడ్ ఉందంటూ పలు రకాలు బెదిరించి అందిన కాడికి వసూలు చేస్తున్నాడు. ఉప్పల్, బోడుప్పల్, చంగిచర్ల, మేడిపల్లి, నాగోల్ తదితర ప్రాంతాల్లో మాటు వేసి వసూళ్ల దందాకు తెరలేపాడు. ఒకసారి తానే ఆర్టీఓను అంటూ..మరోసారి సార్ కారులో ఉన్నాడంటూ బెదిరింపులకు పాల్పడేవాడు. అతడి వైఖరిపై అనుమానం వచ్చిన సెంట్రింగ్ మిల్లర్ల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నిఘా ఉంచిన ఉప్పల్ పోలీసులు గురువారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. బ్రెజా కారు స్వాధీనం చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ ఆర్టీఓను అరెస్టు చేసినట్లు సమాచారం అందడంతో బాధితులు పెద్ద సంఖ్యలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చారు. గతంలో ఆర్టీఓ అధికారులు తనకు చలానా వేసి వేధించడంతోనే తానూ రంగంలోకి దిగినట్లు నిందితులు పేర్కొనడం గమనార్హం.

స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు అందె బాబయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుపొందాలంటే గ్రామీణ స్థాయిలో పార్టీని ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి బీజేపీ సభ్యత్వం పొందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యకర్తలు అత్యధిక సభ్యత్వాలను చేయడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు సులువవుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను బీజేపీ అభ్యర్థులే గెలిచే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, నాయకులు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మహేశ్, ఐలయ్య, శ్రీనివాస్, విఠల్‌గౌడ్, నర్సింహ, తిరుపతి, కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, నర్సింగ్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్‌జీ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి


కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్: దివ్యాంగులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ పెంచాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సంఘం నాయకులతో కలిసి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శికి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది దివ్యాంగులు ఎదురు చూస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. డిమాండ్ల సాధన కోసం గ్రామ గ్రామాన దివ్యాంగులను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే డిసెంబర్ 9న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్, మహ్మద్‌గౌడ్, శ్రీను, రహీం పాల్గొన్నారు.

సిల్ట్ చాంబర్లు లేకుంటే కనెక్షన్ లైన్ కట్..!

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: వాణిజ్య భవన సముదాయాలు సిల్ట్ చాంబర్లు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని లేనిపక్షంలో సీవరేజ్ పైప్‌లైన్ కనెక్షన్లను తొలగించాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మెహిదీపట్నం, లంగర్ హౌస్ తదితర ప్రాంతాల్లో డీ–సిల్టింగ్ పనులను పరిశీలించారు. మెహిదీపట్నం అంబా థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై తరచూ పొంగుతున్న మ్యాన్ హోళ్లను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని హోటళ్ల యాజమానులు తమ సీవరేజ్ పైప్ లైన్లను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్ కు అనుసంధానం చేసినందునే వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హోళ్లలో చేరి సమస్య ఎదురవుతుందన్నారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులకు సిల్ట్ చాంబర్లు నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే వారి సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీజీఎం వినోద్ భార్గవ, జీఎం, డీజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.